క్లుప్తంగా

నేటి నుంచి ఉరుసు



వర్కూరులోని అల్లిహుసేన్ స్వామి దర్గా

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో బుధవారం నుంచి అల్లిహుసేన్ స్వామి ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి అబ్దుల్‌సలాం మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గంధము, గురువారం ఉరుసు, శుక్రవారం కిస్తీలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని పీఠాధిపతి కోరారు.

నేడు వాహనాల వేలం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని పోలీసు స్టేషన్ పక్కన పడి ఉన్న 16 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు బహిరంగా వేలం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో గుజిరీ వ్యాపారం చేసేవారు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సి.బెళగల్: గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్ల సమన్వయంతో సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను క్లాప్ మిత్రల ద్వారా ప్రతిరోజు జరిగేలా చూసుకోవాలని ఈఓఆర్డీ పీఎస్‌లకు సూచించారు.

పాఠశాలల తనిఖీ



పాఠశాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సునీలమ్మ

గూడూరు: స్థానిక హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాల, ఏబీఎం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ సునీలమ్మ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల రిజిష్టర్లు, ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల గురించి ఆరా తీశారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

కోలుకోలేక వివాహిత మృతి



మృతి చెందిన ఆదిలక్ష్మి

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వివాహిత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి తెలిపారు. మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామానికి చెందిన మహేష్, అతని భార్య ఆదిలక్ష్మితో కలిసి ఈ నెల 3న బైక్‌పై కర్నూలుకు బయలు దేరారు. మార్గమధ్యలో గుట్టపాడు సమీపంలో అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. దీంతో బైక్ వెనుకాల కూర్చున్న ఆదిలక్ష్మి(27)కింద పడి తీవ్ర రక్తగాయాలకు గురైంది. చికిత్స నిమిత్తం ఆమెను భర్త మహేష్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలు గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆమెకు ఇద్దరు కూతుర్లు సంతానం ఉన్నట్లు సమాచారం.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, సచివాలయాల సంక్షేమ, ఇంజినీర్ సహాయకులతో ఎంఈఓ జ్యోతి కన్‌టిస్టెంట్ రిథమ్ యాప్ నిర్వహణపై అవగాహన, పాఠశాలల్లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ. సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కన్‌టిస్టెంట్ రిథమ్ యాప్ నిర్వహణపై సచివాలయ ఉద్యోగులతో డెమో ఇప్పించారు. జగనన్న గోరుముద్ద పథకం, నాడు – నేడు పనుల పురోగతి, విద్యార్థులకు ఆధార్ సేవల వినియోగంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు.

ప్రజలకు,ప్రభుత్వానికి వారధిలా పనిచేయండి

- వలంటీరు వ్యవస్థ ఎంతో ఆదర్శం
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ,



గడివేములలో సమావేశానికి హాజరైన వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

గడివేముల: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రమైన గడివేములలోని శ్రీరాజరాజేశ్వరీ పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రనిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. మీ పరిధిలోని ప్రతి గడపనూ సందర్శించి ప్రజల సమస్యలు, వారి కుటుంబానికి అందుతున్న సంక్షేమ ఫలాలను తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం జగన్ తీసుకొచ్చిన వలంటీరు వ్యవస్థ దేశంలోనే ఎంతో ఆదర్శంగా నిలిచిందని, పలు రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థ అమలు చేయాలనుకుంటున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సకాలంలో వర్షాలు పడ్డాయని, దీంతో రైతన్నలు ఆనందంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ పరిశీలకుడు గోకుల్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్‌లు రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు తలారి మద్దమ్మ, శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, శివానందరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సీపీ రమణయ్య, పుల్లయ్య, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని,



పాణ్యం సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లులు, గృహసారథులు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసంపై ప్రజల అభిప్రాయాలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన '' మా నమ్మకం –నువ్వే జగన్'' కార్యక్రమాన్ని పాణ్యంలోని శ్రీకృష్ణ కల్యాణమండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అభినందనలు తెలిపారు. అలాగే సమావేశానికి వచ్చిన వలంటీర్లకు సంక్షేమ పథకాల అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని గృహసారథులు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి తెలియజేయాలని, ఇంటి వారితో మాట్లాడి పార్టీ పంపిన ఐదు రకాల అభిప్రాయాలను సేకరించి పంపాలన్నారు. అలాగే ఇంటి యజమాని అభిప్రాయంతో '' మా నమ్మకం –నువ్వే జగన్'' అనే స్టిక్కర్‌ను అతికించాలన్నారు.

అభివృద్ధి బాటలో పాణ్యం..

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. ఎన్నడూ లేనివిధంగా పాణ్యం అభివృద్ధి బాటలో దూసుకెళ్తోందన్నారు. పాణ్యంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఉన్నత విద్య అందుబాటులోకి తెచ్చామన్నారు. సుగాలిమెట్ట వద్ద చిరుధాన్యాల పరిశోధనకు 10 ఎకరాలు కేటాయించామన్నారు. అలాగే పాణ్యంలో మిర్చి యార్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. గాలేరు గేట్లు ఏర్పాటు చేసి ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు రెండుకార్లకు సంవృద్ధిగా నీరిచ్చామన్నారు. అలాగే పాణ్యం చెరువు కింద పొలాలకు నీరు అందించేందుకు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి ఛానల్ తవ్వి చెరువును నింపుతామన్నారు. తమ్మరాజుపల్లె గ్రామానికి జీవనాడి అయిన ఏటాపాయ చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదలు పంపి త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, పర్యవేక్షకులు గోకుల్‌రెడ్డి, ఎంపీపీ ఉసేన్ బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ మేకల పల్లవి, గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: గ్రామాల్లోని ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ పీరయ్య అన్నారు. మంగళవారం రాత్రి సి.బెళగల్ మండలంలోని కంబదహాల్‌లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పాత నేరస్తులు, రౌడీషీటర్లకు, వివిధ కేసులలో అనుమానితులు, మద్యం నిందితులకు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కక్షలు, రౌడీయిజం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మహిళా రక్షణ చట్టాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సకాలంలో పాఠశాలకు రావాలి

కల్లూరు: ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరుకావాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ కస్తూరీ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించి ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం ఆయన శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా చదువులు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆధార్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గోరంట్ల గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కోడుమూరు రూరల్: సున్నా నుంచి 5సంవత్సరాల్లోపు చిన్నారుల తల్లిదండ్రులు ఆధార్‌కై వివరాలను నమోదు చేయించుకోవాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని గోరంట్ల, అమడగుంట్ల గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయాల రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేసి ఇన్సూరెన్స్ కార్డులివ్వాలని, జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇండ్లను నిర్మించుకునేలా చూడాలని, ప్రతి రోజు 3 నుంచి 5 గంటల వరకు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న బాలబాలికలు, గర్భవతులను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం, మందులివ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న కల్యాణమస్తు, షాదీతోఫాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఆయా సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పిల్లలు, విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ మాధవీలత పేర్కొన్నారు. కె.నాగలాపురంలోని ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కొత్తగా ఆధార్ కార్డు నమోదు, పేరు, ఇంటి చిరునామాలో మార్పులు, ఆధార్ అప్‌డేట్ వంటివి చేసుకోవచ్చునన్నారు. ఆధార్ సేవల కొరకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు గ్రామాల్లోనే ప్రభుత్వం ఆధార్ సేవలను ఏర్పాటు చేసిందన్నారు. కావున గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న చైర్మన్ సుభాస్‌చంద్రబోస్

పాణ్యం: ప్రజలు, యువత గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాస్‌చంద్రబోస్ అన్నారు. మంగళవారం పాణ్యంలోని గ్రంథాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. చిన్నారులు గ్రంథాలయలంలో లభించే కిడ్స్ పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అధికంగా సెల్‌ఫోన్ల వాడకం, సామాజిక మాధ్యమాలతో తప్పుదోవ పట్టవద్దన్నారు. ప్రతి చిన్నారికి గ్రంథాలయ సభ్యత్వం తీయించి వారి భవిష్యత్‌కు కృషి చేయాలన్నారు. అనంతరం గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రకాష్, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ కోటయ్య, గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మీ, కో ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

- ఆర్డీఓ హరిప్రసాద్

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కర్నూలు ఆర్డీఓ హరి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులతో బ్రహ్మోత్సవాల వసతుల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. మహాశివరాత్రిని పురస్కరించుకొని 7 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా తాగునీరు, విద్యుత్, రవాణా, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, బారీగేడ్లు, పోలీసు కంట్రోల్ రూమ్‌లను సమకూర్చాలని సూచించారు. విద్యుత్ శాఖ తరుపున దేవస్థాన మైదానంలో ఉన్న ట్రాన్సుఫార్మర్‌ను తొలగించి పక్కనే ఉన్న స్థలంలో శాశ్వతంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదేవిధంగా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. భక్తుల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతామని హుసేనాపురం వైద్యాధికారి డాక్టర్ అమర్‌నాథ్ అన్నారు. శాంతి భద్రతలకు ఇబ్బంది తలెత్తకుండా దాదాపు వంద మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామని ఎస్‌ఐ మల్లికార్జున వెల్లడించారు భక్తులకు సమస్యలు తలెత్తకుండా అన్ని వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక మరుగుదొడ్ల(మొబైల్ లెట్రీన్)ను ఏర్పాటు చేస్తామన్నారు. నిరంతరం క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేస్తామన్నారు. స్వాముల వారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీతో తొక్కిసలాటలు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరులో శ్రీచౌడేశ్వరీదేవి తిరుగు రథోత్సవ దృశ్యం

వైభవంగా రథోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి తిరుణాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారి తిరుగు రథోత్సవ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూజారులు మేళతాళాల మధ్య తీసుకొచ్చి రథంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుగు రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోడుమూరు పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

కర్నూలు (సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లలో పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వర రావు సంక్షేమ హాస్టళ్ల అధికారులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి రెమిడియల్ శిక్షణా తరగతులను పక్కాగా నిర్వహించాలన్నారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ హాస్టళ్లలోని 10వ తరగతి విద్యార్థులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన సబ్జెక్టులలోని మార్కుల ఆధారంగా వారిని విభజించుకోవాలన్నారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి తగు శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణా తరగతులను ఉన్నతాధికారులు తరచూ తనిఖీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి పదవ తరగతి విద్యార్థులపై ఫోకస్ పెట్టాలన్నారు. నూటికి నూరు శాతం విద్యార్థులు పాస్ అవ్వాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఈడీ నాగేశ్వరరావు, మైనార్టీ సంక్షేమ అధికారి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

కర్నూలు (న్యూటౌన్): 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చేయడానికి మనమందరం కలిసి కృషి చేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని ఏ జెడ్ ఫంక్షన్ హాలులో కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38, 39, 40వ వార్డులకు సంబంధించి వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గడప గడపకు సృహసారథులు, కన్వీనర్లు తిరిగి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని పరిశీలిస్తూ వారికి రావాల్సిన పథకాలు ఏవైనా మిగిలి ఉంటే వెంటనే ప్రభుత్వం తరపున అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటిని పేదలకు అందించడమే గృహ సారథులు, కన్వీనర్ల లక్ష్యమన్నారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నియమించిన గృహసారథులు వారికి కేటాయించిన ఇళ్లలోని లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ద్వారా జరిగిన లబ్ధిని వివరించాలన్నారు. సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. కార్యక్రమంలో 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఉల్చాలలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, స్థానిక మహిళలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమానికి చిరునామా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి మనమందరం కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిన్న లక్ష్మన్న, కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు, ఏఓ విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయశాస్త్రి, ఈఓఆర్డీ నాగేశ్వరరెడ్డి, ఏపీఓ మహమ్మద్ బాషా, ఏఈఓ మోహన్ రెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, 12వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వసుల సుధాకర్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.